RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 396 | 07 ఆదివారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

పేదలు చెరువులను ఆక్రమిస్తే అర్థముంది..

## ధనికులు కూడా చెరువులను కబ్జా చేస్తే ఏమనాలి?

: సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగిల్ ఫోర్స్ విభాగాలు నేడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ అంశాలపై ప్రసంగించారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమ కట్టడాల నుంచి కాపాడేందుకు 2024 జులైలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సీనియర్ ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో, రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో కలిపి సుమారు 3,000 మంది సిబ్బందితో పనిచేస్తున్న ఈ ఏజెన్సీ, ఇప్పటివరకు రూ. 1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని తెలిపారు. "గతంలో పలుకుబడి ఉన్నవారు విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కోసం జలవనరులను కబ్జా చేసేవారు. ఇప్పుడు ఆ సాహసం ఎవరూ చేయడం లేదు" అని రేవంత్ రెడ్డి వివరించారు. పేదలు చెరువులను కబ్జా చేస్తే అర్థముంది.. కానీ ధనికులు కూడా చెరువులను ఆక్రమిస్తే ఏమనాలి? అంటూ వ్యాఖ్యానించారు.

అదే సమయంలో, యువతను లక్ష్యంగా చేసుకున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈగిల్ ఫోర్స్ పనితీరును ఆయన ప్రశంసించారు. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన యాంటీ-నార్కోటిక్స్ విభాగాల్లో ఇది ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు.

పాలనాపరమైన ఇతర అంశాలు

తమ ప్రభుత్వం గత 15 నెలల్లో కాలంలోనే 67,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, త్వరలోనే మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు రుణమాఫీ, మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక కార్యక్రమాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు కల్పించామని, తద్వారా ప్రభుత్వ రాబడి తగ్గినా పర్యావరణ హితానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ రెడ్డి

# కుమ్మక్కయ్యారు

: హరీశ్ రావు



పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు. ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# అసలు నువ్వెవరు?

: ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం



నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు ప్రకాశ్ రాజ్‌కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సాగర్ ఘాటైన విమర్శలు చేశారు. "జనసేన ఒంటరిగా పోటీ చేస్తుందో, పొత్తుతో వస్తుందో ఆయనకెందుకు? అసలు ప్రకాశ్ రాజ్ ఎవరు? మేమెందుకు ఆయనకు సమాధానం చెప్పాలి?" అని సాగర్ సూటిగా నిలదీశారు. ప్రశాంతంగా ఉన్నవారిని కెలకడం ప్రకాశ్ రాజ్‌కు అలవాటని ఆరోపించారు. గద్దర్ అంశంపై మాట్లాడుతూ, "గద్దర్‌ను ఎవరు ఉపయోగించుకున్నారు? పవన్ కల్యాణ్ జేబు నుంచి నేరుగా డబ్బులు తీసుకునేంత చనువు తనకు ఉందని స్వయంగా గద్దరే చెప్పారు" అని ఆయన గుర్తుచేశారు. ప్రకాశ్ రాజ్ వృత్తిపరమైన ప్రవర్తనను కూడా సాగర్ ప్రశ్నించారు. "అసలు ఆయన ఎప్పుడైనా షూటింగ్‌కు సమయానికి వచ్చారా? మీరు ఎంత సహృదయులో మీ చిత్ర పరిశ్రమ వారిని అడిగితే తెలుస్తుంది" అంటూ ఎద్దేవా చేశారు. ఈ దేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన తోడ్పాటు ఏమిటని సాగర్ ప్రశ్నించారు. "తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ ఉద్యమంలో పాల్గొని కుటుంబాలను పోగొట్టుకుంది ప్రకాశ్ రాజా?" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అసలు నువ్వెవరు ప్రకాశ్ రాజ్?" అని సూటిగా ప్రశ్నించిన ఆయన, తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన సేవ ఏంటని నిలదీశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

# నిరుద్యోగులకు శుభవార్త..

## టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన




తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వరుసగా శుభవార్తలు అందిస్తోంది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణను బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పనితీరును మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు.

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఈ సడలింపుల వల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు మంచి అవకాశం లభించనుంది. అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా జులై 19ని నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్థులు గడువు తేదీలోగా ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యా అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, జిల్లాల వారీగా ఖాళీల కేటాయింపు, దరఖాస్తు రుసుము వంటి సమగ్ర సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ "స్త్రజూంఎ.స్త్రశీజ.ఱఅ ను సంప్రదించాలని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ పీడీఎఫ్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

రేపు తెలంగాణలో ఐదు జిల్లాలకు

# భారీ వర్ష సూచన



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అనుకూలిస్తోంది. ఈ క్రమంలో జూన్ 7 (ఆదివారం) నాడు రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిక జారీ చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ వెల్లడించిన తాజా బులెటిన్ ప్రకారం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే, రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ పలుచోట్ల ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో రానున్న 24 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షపు జల్లులు పడే వీలుందని అంచనా వేశారు. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వాతావరణ కేంద్రం వివరించింది.

## వనస్థలిపురం ఎస్.హెచ్.ఓ. రవిబాబుకు ఘన సత్కారం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి హైదరాబాద్ (వనస్థలిపురం) జూన్ 06: మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్.హెచ్.ఓ.) ఎస్. రవిబాబును శనివారం స్థానిక యువ నాయకులు, మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో వనస్థలిపురం పోలీసులు అందిస్తున్న సేవలను అభినందిస్తూ.. ఎస్.హెచ్.ఓ. రవిబాబును యువ నాయకుడు చిప్పలపల్లి యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.ఎన్.ఆర్.లు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో స్థానికుల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్న పోలీస్ అధికారుల సేవలు అభినందనీయమన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు, ట్రాఫిక్ నియంత్రణకు రవిబాబు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను వారు కొనియాడారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో యువ నాయకుడు చిప్పలపల్లి యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.ఎన్.ఆర్.లతో పాటు నకిరేకంటి శ్రీకాంత్, చేడె సైదులు, బల్గూరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీని సందర్శించిన కాంగ్రెస్ నేతలు.. ఈనెల 10న సీఎం రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఏర్పాట్ల పరిశీలన!



హైదరాబాద్ స్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 6

ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే లికిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (ఖూ=) మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి (ఙఖ=) మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి (ణదీ=) మరియు ఇతర ముఖ్య నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు....- ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి పిసిసి కార్యదర్శి అమరేందర్ రెడ్డిఏఎంసీ చైర్మన్ కృష్ణ నాయక్, సరికొండమల్లేష్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్ మరియు సామిడి గోపాల్ రెడ్డి, అల్లే కుమార్ ఐఎన్‌టియుసి నడికుడి శివ, బొక్క భూపాల్ రెడ్డి వైస్ చైర్మన్ ఎష్ట్ర యాదయ్య, శివగల యాదయ్య, సురేందర్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మదనపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, దంతోజు నరసింహ చారి,రజనీకాంత్, నిరంజన్,వెంకటేశ్వర్లు మండల అధ్యక్షులు, సర్పంచులు వార్డ్ మెంబర్లు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## గాలి దుమారానికి కూలిన నిర్మాణంలో ఉన్న గోడ – బాధితులకు అండగా నిలిచిన జక్కిడి చారిటబుల్ ట్రస్ట్..!!





మన ఉమ్మడి మన్సూరాబాద్ డివిజన్ (ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ డివిజన్) పరిధిలోని వీరన్నగుట్టలో ఈరోజు సాయంత్రం వీచిన గాలి దుమారం మరియు వర్షం కారణంగా నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి గోడ కూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడటంతో ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం కాలనీ పెద్దలు నా దృష్టికి తీసుకురాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించాను. అనంతరం బాధితుడు రేకుల ఇంటి యజమాని శేఖర్ యాదవ్ గారిని పరామర్శించి, మా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున ₹10,000/- (అక్షరాల పదివేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని వారికి అందించడం జరిగింది. అలాగే నిర్మాణంలో ఉన్న ఇంటి యజమానులతో మాట్లాడి, ధ్వంసమైన రేకుల ఇంటిని తిరిగి నిర్మించే బాధ్యతను తీసుకోవాలని కోరడం జరిగింది. బాధిత కుటుంబానికి భవిష్యత్తులో మరే విధమైన సహాయం అవసరమైనా మా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరన్నగుట్ట వాసులు కేకేఎల్ గౌడ్, నర్సింహ యాదవ్, దీ=ూ పార్టీ నాయకులు చంద్రా రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం వారు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మీ

జక్కిడి రఘువీర్ రెడ్డి

చైర్మన్ - జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ,,,,,సీనియర్ నాయకులు - BRS పార్టీ

ఎల్.బి.నగర్

## గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు..

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి) సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బందిశనివారం మద్దిరాల మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని స్థానిక ఎస్ఐ యం వీరన్న తెలిపారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని తెలిపారు . ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ సంబంధించిన సమాచారం ఉంటే స్థానిక పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా అలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత సమాజంపై అవగాహన.

హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్ /వరంగల్ ప్రతినిధి : గీసుకొండ మండలం రాంపూర్ గ్రామములో సర్పంచ్ రడం భరత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా వరంగల్ డివిజన్ పంచాయతీ అధికారి వేదమతి హాజరయ్యారు.ఈ సందర్భంగా డిల్పిఓ వేదవతి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ మనుగడకు కలిగే తీవ్రమైన నష్టాలను వివరించారు. నిత్య జీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం పెట్టాలని, దానికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా సేకరించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామ సభలో రంగు రంగుల డబ్బాలను ఉంచి చెత్త వర్గీకరణను ప్రదర్శించారు.సర్పంచ్ రడం భరత్ కుమార్ మాట్లాడుతూ రాంపూర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, స్వచ్ఛమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.అనంతరం రాంపూర్ పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డు, వైకుంఠ దామాన్ని పరిశీలించారు. రెండవ విడతలో గ్రామ సభలు నిర్వహించిన గ్రామాల్లో గీసుకొండ లో తహసీల్దార్ యం డి రియాజుద్దీన్,కొనాయమాకుల లో ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి,రాంపూర్ లో ఎంపీఓ పాక శ్రీనివాస్ లు, మనుగొండ లో ఎఓ హరి ప్రసాద్ బాబు, చంద్రయ్యపల్లి లో ఏఈ అనిల్ కుమార్ లు పాల్గొన్నారు.ఈ గ్రామ సభల్లో సర్పంచులు వీరగోని రాజ్ కుమార్, వజ్ర రాజు,పేర్ల శ్రావణ్, వొగ్గె మౌనిక, వ్యవసాయ శాస్త్ర వేత్త లు హర్ష వర్ధన్, సాయి చందు,



వివిధ శాఖల అధికారులు,ఎఈఓ లు, గ్రామ పోలీస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రవీన,వీరేషం, ప్రవీణ్, ప్రియాంక,జిపివో లు, ఆశ, అంగన్ వాడి కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### చైర్పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి

హైదరాబాద్ ఎస్టేట్ 06 జూన్

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11, 13వ వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమాల్లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ప్రజల నుంచి వినతులు, సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే వార్డుల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ పనుల పూర్తి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి వినతిని పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, రామకృష్ణపూర్ పట్టణ యస్ఐ శ్రీధర్, 11 వార్డ్ కౌన్సిలర్ భోమ్మ భూమా గౌడ్,13వ వార్డు కౌన్సిలర్ జక్కబోయిన మంజుల- కుమార్,



సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మునిసిపాలిటీ కో-ఆప్షన్ పదవికి సిపిఐ తరపున మిట్టపెల్లి పౌలు నామినేషన్

హైదరాబాద్ ఎస్టేట్ 06 జూన్

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలో భాగంగా సిపిఐ పార్టీ తరపున మైనారిటీ కోటాలో కో-ఆప్షన్ పదవికి మిట్టపెల్లి పౌలు శనివారం నామినేషన్ దాఖలు చేశారు. సిపిఐ పార్టీ మునిసిపల్ వైస్ ఛైర్పర్సన్ మిట్టపల్లి సరితా శ్రీనివాస్, సిపిఐ పార్టీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఆయన మునిసిపల్ అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ మైనారిటీల హక్కుల కోసం, క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు కట్టుబడి ఉన్న వ్యక్తిగా మిట్టపెల్లి పౌలును మైనారిటీ కోటాలో బరిలోకి దించినట్లు వారు వెల్లడించారు. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కాదండి సాంబయ్య, మామిడి గోపి, ఎగుడ మొండి కౌన్సిలర్లు కౌడగాని సాంబయ్య, మద్దేల శంకర్ పార్టీ ప్రజా సంఘాల నాయకులు



పాల్గొని మిట్టపెల్లి పౌలుకు తమ మద్దతును ప్రకటించారు.

## ఆవాస 12 అంతస్తుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

### డాక్టర్ వరప్రసాద్

### ఆవాస నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని

### కూడాచైర్మన్ తలాటం సత్యకు వినతిపత్రం సమర్పించిన డాక్టర్ పిట్టా వరప్రసాద్

హైదరాబాద్ ఎస్టేట్ కాకినాడ జూన్ 6:

కాకినాడ నగరంలోని మాధవపట్నం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఆవాస అపార్ట్మెంట్ 12 అంతస్తుల భవనం విషయంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి సమగ్ర విచారణ జరపాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ తలాటం సత్య గారికి డాక్టర్ పిట్టా వరప్రసాద్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడలి సత్యమూర్తి కలిసి వినతిపత్రం సమర్పించారు.

వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఆవాస అపార్ట్మెంట్‌కు బి ఏ.చీశీ.1104/0025/దీ/కేకే డి ఎం డి ఆర్ ఎల్/ఎస్ పి ఎ 2022, తేదీ 25-03-2022 ద్వారా స్టిల్ట్ + గ్రౌండ్ + 4 అంతస్తుల నివాస భవన నిర్మాణానికి మాత్రమే అనుమతులు మంజూరు చేయబడ్డాయి. అనంతరం జీవో ఎంఎస్ చీశీ.273 మరియు డి ఎం శాఖ, తేదీ 19-12-2025



ప్రకారం సవరించిన నిబంధనల కింద స్టిల్ట్ + గ్రౌండ్ + 11 అంతస్తుల నిర్మాణానికి రివైజ్డ్ ప్లాన్ సమర్పించబడినప్పటికీ, ఆ ప్రతిపాదన ఇంకా సంబంధిత హై-రైజ్ కమిటీ మరియు ఉన్నత అధికారుల పరిశీలనలోనే ఉందని తెలిపారు. అయితే తుది అనుమతులు లేకుండానే ప్రస్తుతం 12 అంతస్తుల భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు సమాచారం ఉందని, ఇది పట్టణ ప్రణాళికా నిబంధనలకు విరుద్ధమని డాక్టర్ పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.ప్రజల భద్రత, అగ్నిమాపక ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత మరియు పట్టణాభివృద్ధి నియమాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి, సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కూడా చైర్మన్ తలాటం సత్య గారు వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధిత అంశాలను పరిశీలించి



చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డా. పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, “చట్టానికి అతీతంగా ఎవరూ ఉండరని, ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు కలిగించే అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం ఉపేక్షించకూడదని“ అన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
07 ఆదివారం జూన్ 2026

# తెలంగాణ ప్రజల ఆశయాలు నెరవేరాలి: లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా

హైదరాబాద్ ఎస్టేట్, జూన్ 6:
తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి ఫలాలు అందడం లేదని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దశరథ్ నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువకులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆ ఉద్యమ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందనే భావనతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్భవించిందని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు రావాలని ఆశించినప్పటికీ, నిరుద్యోగం, రైతుల సమస్యలు, విద్య, వైద్యం మరియు మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో ఇంకా అనేక సవాళ్లు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై స్పందిస్తూ, ఒకప్పుడు తెలంగాణ కోసం పోరాడిన నాయకులు వివిధ రాజకీయ పార్టీలలో చేరడం వారి వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం మరియు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి తెలంగాణవాడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, పారదర్శక పాలన మరియు సమాన అవకాశాల కల్పన ద్వారానే తెలంగాణ సాధనకు నిజమైన అర్థం



వస్తుందని దశరథ్ నాయక్ అన్నారు. తెలంగాణ ఉద్యమం యొక్క అసలు లక్ష్యాలైన అభివృద్ధి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పురుగు మందులు, విత్తనాల కొనుగోలులో రైతన్న లు అప్రమత్తంగా ఉండాలి
## కల్తీ విత్తనాలు అమ్మితే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వండి
## అన్నదాతలకు గీసుగొండ పోలీసుల సూచన

హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్ /వరంగల్ జిల్లా ప్రతినిధి :

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని గీసుగొండ పోలీసులు సూచించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని పురుగు మందులు మరియు లైసెన్స్ లేని విక్రేతల కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.
రైతులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో బిల్లు మరియు రసీదు తీసుకొని భద్రపరచుకోవాలి. ప్యాకెట్లపై ఉన్న తయారీ తేదీ, గడువు తేదీ , బ్యాచ్ నంబర్ మరియు నాణ్యతా గుర్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలి.
లైసెన్స్ లేని విక్రేతలు, అనుమానాస్పద నాణ్యత గల విత్తనాలు లేదా పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.
అలాగే రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బిల్లులు మరియు ప్యాకింగ్ కవర్లను భద్రపరచుకోవాలని, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు అవి ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు.
గీసుగొండ పోలీసులు రైతుల సంక్షేమం మరియు భద్రత కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారని, నకిలీ వ్యవసాయ ఉత్పత్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.




# మమతా బెనర్జీకి దెబ్బ మీద దెబ్బ... టీఎంసీకి గుడ్ బై చెప్పిన మైనారిటీ నేత

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం సంక్షోభంలో చిక్కుకున్న తృణమూల్ కాంగ్రెస్‌కు (టీఎంసీ) మరో భారీ షాక్ తగిలింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నాయకత్వ శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి మహమ్మద్ అజ్మల్ సిద్ధిఖీ శనివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు.
ఇటీవలే హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన సిద్ధిఖీ, తన రాజీనామా లేఖను టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి పంపారు. పార్టీలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, నిబద్ధత గల కార్యకర్తలను విస్మరిస్తున్నారని ఆయన ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాజీనామా అనంతరం సిద్ధిఖీ మాట్లాడుతూ అభిషేక్ బెనర్జీపై సంచలన ఆరోపణలు చేశారు. "ప్రస్తుతం పార్టీ కుప్పకూలుతోందంటే దానికి అభిషేక్ బెనర్జీయే ప్రధాన కారణం. ఆయన నియంతృత్వ ధోరణి, అధికార కేంద్రీకరణ వల్ల నిజాయతీ గల కార్యకర్తలకు అన్యాయం జరుగుతోంది. వారి అభిప్రాయాలకు పార్టీలో విలువ లేకుండా పోయింది" అని విమర్శించారు. పాత కేసులు, ఇతర ఒత్తిళ్ల కారణంగా పార్టీలో కొనసాగలేని పరిస్థితులు నెలకొన్నాయని, రాజీనామా తర్వాత ప్రస్తుతం తాను ఎంతో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ పరాజయం పాలైన నేపథ్యంలో, పార్టీలో అంతర్గత విభేదాలు, అసమ్మతి స్వరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ తరుణంలో మైనారిటీ



విభాగంలో కీలక నేతగా ఉన్న సిద్ధిఖీ రాజీనామా చేయడం పార్టీకి మరింత నష్టం కలిగించే పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# సీనియర్లను పక్కనబెట్టి అయినా అతడ్ని ఆడించాలి: గవాస్కర్

ఐర్లాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీని తప్పకుండా తుది జట్టులోకి తీసుకోవాలని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సూచించాడు. అవసరమైతే రెగ్యులర్ ఓపెనర్లను పక్కనపెట్టి అయినా అతనికి అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలవడమే కాకుండా, రికార్డు స్థాయిలో 72 సిక్సర్లు కొట్టి వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ప్రదర్శనతో ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లతో పాటు ఆసియా క్రీడలకూ ఎంపికయ్యాడు. 15 ఏళ్ల 71 రోజుల వయసులో భారత సీనియర్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు.
"అధికారం నా చేతిలో ఉంటే, ఐర్లాండ్ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీని కచ్చితంగా ఆడిస్తాను. ఆ టీ20 మ్యాచ్‌లలో అతను ఆడటం నేను చూడాలనుకుంటున్నాను. తుది జట్టులో అతను ఉండాలి. అవసరమైతే, సంజూ శాంసన్‌ను ఒక మ్యాచ్‌లో, అభిషేక్ శర్మను మరో మ్యాచ్‌లో పక్కనపెట్టి అయినా సరే" అని గవాస్కర్ అన్నాడు.
"అతని ఫామ్, అతను చేసిన పరుగులు చూడండి. ఇంత అద్భుత ప్రదర్శన తర్వాత అతన్ని ఎలా ఎంపిక చేయకుండా ఉంటారు? డ్రెస్సింగ్ రూమ్‌లో అతను ఎన్నో విషయాలు నేర్చుకుంటాడు, అది అతని కెరీర్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గవాస్కర్ వివరించాడు. శనివారం నాడు బీసీసీఐ ప్రకటించిన భారత టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించారు. సూర్యకుమార్ యాదవ్‌కు చోటు దక్కలేదు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌ల నుంచి విశ్రాంతి ఇచ్చి, ఆసియా క్రీడలకు ఎంపిక చేశారు. కాగా, ఈ పర్యటనలో వైభవ్‌కు తోడుగా ఉండేందుకు అతని తల్లిదండ్రులను కూడా అనుమతించాలని బీసీసీఐ నిర్ణయించింది.



# అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన
## కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు


( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 06:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు కోహెడ లో 2284.32 కోట్ల భారీ నిధులతో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం అగ్రికల్చర్ అధికారి. ఏఈఓ ఆఫ్సియా బేగం, మహేశ్వరం పోలీస్ ఏఎస్ఐ రమేష్, మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్లు పోతర్ల తిరుపతయ్య యాదవ్, పేయ్యాల దేవేందర్, ఏపూరి సాయిలు,కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం మండల అధ్యక్షులు శెట్టి అశోక్, మహేశ్వరం గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు మోదిని విజయ్ కుమార్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణగంటి ఆకాష్, గ్రామ శాఖ ప్రచార కార్యదర్శి పినమోని శ్రీకాంత్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోతే యాదయ్య, పేయ్యాల కృష్ణ, సేవియా నాయక్, మహేశ్వరం గ్రామ పెద్దలు కటికల శ్రీహరి ముదిరాజ్ , తదితరులు పాల్గొన్నారు






# జల్పల్లిలో మహిళ మిస్సింగ్ కేసు నమోదు

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 06:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం హరీష్ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫిర్యాదు వివరాల ప్రకారం,బీహార్ రాష్ట్రానికి చెందిన మనోజ్ కుమార్ తన భార్య సునీతా దేవి (30) మరియు పిల్లలతో కలిసి నాలుగేళ్ల క్రితం ఉపాధి కోసం జల్పల్లికి వచ్చి నివాసం ఉంటున్నారు.మే 31వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రించగా,జూన్ 1వ తేదీ ఉదయం లేచి చూసే సరికి సునీతా దేవి ఇంట్లో కనిపించలేదని,ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని తెలిపాడు.అనంతరం బంధువులు,పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని పేర్కొన్నాడు.గతంలో ఎనిమిది నెలల క్రితం కూడా సునీతా దేవి నితిన్ అనే వ్యక్తితో వెళ్లిపోయిన సందర్భంలో మిస్సింగ్ కేసు నమోదు చేయగా తిరిగి ఇంటికి వచ్చిందని తెలిపాడు.ఈసారి కూడా నితిన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు.అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5 అడుగులు,తెల్లటి వర్ణం,అండాకార ముఖం కలిగి ఉండగా,ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన





హైదరాబాద్ ఎస్టేట్(ప్రతినిధి) ఎల్బీనగర్
ఈ రోజు సరూర్ నగర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లి గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించిన ఉమ్మడి శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత యువజన నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కి ఉమ్మడి శ్రీ రామకృష్ణాపురం డివిజన్లో ఉన్న సమస్యలను సమస్య పరిశీలించి శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా చూడాలని సానిటేషన్ విషయంలో స్వీపర్ల సంఖ్యను పెంచాలని కోరడం జరిగింది అందుకు డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గట్ల రవీంద్ర శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ కుమార్, ముప్పిడి లింగస్వామి గౌడ్ ,జెల్లా జగన్నాథం, ఎస్.కె మమ్మద్, పగిళ్ల భూపాల్ రెడ్డి ,బొడ్డుపల్లి మహేందర్, నబీ , రఫీ, రామకృష్ణ గౌడ్, కిరణ్ కుమార్, సాయికుమార్, మంచుకొండ శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, దోర్నాల చంద్రమౌళి,కృష్ణారావు, వెంకటరమణారెడ్డి, ప్రేమ్ నాయక్,కందుకూరి సుదర్శన్, గుణగంటి రమేష్ గౌడ్, మోహన్ రెడ్డి, భవాని,యాదయ్య, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
07 ఆదివారం జూన్ 2026

# ఎమ్మెల్యే కవ్వంపల్లి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కు తప్పిన ప్రమాదం



మానకొండూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. కవ్వంపల్లి ఎక్కిన లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి కిందపడిపోయింది. ఆ సమయంలో లిఫ్ట్‌లో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కూడా ఉన్నారు. ఆరెపల్లి మోహన్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు కవ్వంపల్లి సత్యనారాయణ వెళ్లారు. వేడుకలు ముగించుకుని భవనంలోని రెండో అంతస్తు నుంచి వారు లిఫ్ట్ ద్వారా కిందకు వస్తుండగా అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ లిఫ్ట్ ఒక్కసారిగా నేరుగా కిందకు పడిపోయింది.


భారీ శబ్దానికి అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, అనుచరులు క్రాష్ అయిన లిఫ్ట్ తలుపులు తెరిచి లోపల ఉన్న ఇద్దరు నేతలను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రజాప్రతినిధులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో నాయకులు, కార్యకర్తలు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఒకే లిఫ్ట్‌లో ఇద్దరు వేర్వేరు పార్టీల నేతలు ఉండటం, ఈ ప్రమాదం జరగడం స్థానికంగా సంచలనంగా మారింది.

# గండిపేట భూకబ్జా కేసు.. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి 14 రోజుల రిమాండ్



సైబరాబాద్ పరిధిలోని గండిపేటలో వెలుగుచూసిన రూ. 1,500 కోట్ల రూపాయల భూకుంభకోణం కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తమిళనాడులో అరెస్టయిన ఆయనను పోలీసులు శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో, పోలీసులు ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసు వెలుగుచూసినప్పటి నుంచి పరారీలో ఉన్న బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించి, నార్సింగి పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆయన అనుచరులు, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కొంత సమయం పాటు ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్రహ్మనాయుడిని కోర్టుకు తరలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని సర్వే నంబర్ 18లో గల సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మనాయుడు మరికొందరితో కలిసి కుట్ర పన్నారని గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి మే 23న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు), రెవెన్యూ రికార్డులను సృష్టించి, ఆ భూమిని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 1,500 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే అయిన బ్రహ్మనాయుడు, ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఈ కుంభకోణానికి సంబంధించి పోలీసులు ఇప్పటివరకు మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## మేము ఇప్పటికీ కడప కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది: అనిత



వైసీపీ అధినేత జగన్ పై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి అంబేద్కర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని... దళిత నాయకురాలైన తనతో పాటు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై కూడా అక్రమంగా అట్రాసిటీ కేసులు పెట్టించారని అనిత మండిపడ్డారు. ఆ కేసుల నిమిత్తం నేటికీ తాము కడప కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.
అలాగే, సాధారణంగా అంబేద్కర్ విగ్రహాలు ఊరి చివరన ఉంటాయని... కానీ, కనిగిరి పట్టణ నడిబొడ్డున అన్ని వర్గాల ప్రజలు కలిసి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆరుగురు ప్రధానుల వద్ద పనిచేసిన ఘనత దివంగత నేత రామ్ విలాస్ పాశ్వాన్ ది అని కితాబునిచ్చారు.ఇక కూటమిపై వస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తూ... నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో అందరికీ 'రెడ్‌బుక్' మాత్రమే కనిపిస్తోందని, కానీ ఆయన రాజ్యాంగాన్ని చేతబూని యాత్ర చేసిన విషయం ఎందుకు కనిపించడం లేదని హోంమంత్రి అనిత ప్రశ్నించారు.

# పవన్ కల్యాణ్ 'అయ్య జాగీరు' వ్యాఖ్య

## : కవితకు, పొన్నం ప్రభాకర్‌కు జనసేన కౌంటర్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను రాజకీయ ప్రత్యర్థులు కావాలనే వక్రీకరిస్తున్నారని తెలంగాణ జనసేన నేతలు ఆరోపించారు. 'తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు' అంటూ పవన్ చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం వేరని వారు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన కార్యక్రమానికి అనుమతి నిరాకరించిన నేపథ్యంలో పవన్ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకలాపాలను అడ్డుకోవడాన్ని ప్రశ్నిస్తూ, రాష్ట్రాన్ని ఎవరూ సొంత ఆస్తిలా భావించవద్దని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో భవిష్యత్తులో జరగబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడంతో పాటు రాజకీయంగా విస్తరిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. పవన్ తెలంగాణ అస్తిత్వాన్ని, ఉద్యమాన్ని, ప్రజలను అవమానించారని మంత్రులు ఆరోపించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు నేతలు.. పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిడ్డల త్యాగాలతో ఏర్పడిన ఈ రాష్ట్రం ఇక్కడి భూమిపుత్రులదేనని బీఆర్ఎస్ నేత కవిత కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన జనసేన నేత సాగర్‌తో పాటు పలువురు నాయకులు.. పవన్ మాటలను వక్రీకరించవద్దని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొంటున్న సమయంలో, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే పవన్ మాట్లాడారని వారు వివరించారు. తెలంగాణ కచ్చితంగా మన 'అయ్య జాగీరే'నని, ఈ భూమిపుత్రులదేనని పవన్ కల్యాణ్ అన్నారని వారు గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో జనసేన పార్టీ తరఫున పోటీ చేయబోయేది ఇక్కడి బిడ్డలేనని స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేస్తున్న వారంతా అవినీతిపరులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్ అవినీతి చిట్టా చాలా పెద్దదని, మంత్రిగా ఆయన ఏం సాధించారని ప్రశ్నించారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు. "తెలంగాణను మేమే తెచ్చాం" అని చెప్పుకున్న వారి పదేళ్ల పాలనను, "మేమే ఇచ్చాం" అని చెబుతున్న వారి రెండేళ్ల పాలనను ప్రజలు చూస్తున్నారని సాగర్ అన్నారు. తెలంగాణ వాదం అత్యంత పవిత్రమైనదని, కానీ గతంలో తెలంగాణను వ్యతిరేకించిన ప్రొఫెసర్ నాగేశ్వరరావు లాంటి వారు సైతం ఇప్పుడు ఈ వాదాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి కేసులో తీహార్ జైల్లో చిప్పకూడు తిన్నవారు కూడా ఇప్పుడు నీతులు చెబుతుంటే వినాల్సి వస్తోందని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "అక్కా, తెలంగాణ ఉద్యమంలోకి మీరు ఎప్పుడు వచ్చారు? 2000 సంవత్సరంలో ఉద్యమం ప్రారంభమైనప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు? ఉద్యమంలో విద్యార్థులు లాఠీ దెబ్బలు తిన్నప్పుడు మీరు ఎక్కడున్నారు? ఉద్యమం ఉద్ధృతంగా ఉన్న సమయంలో, ఇక్కడ డబ్బులు దండుకోవచ్చని అమెరికా నుంచి వచ్చారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. కవితకు ఇప్పుడు వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ఆయన ధ్వజమెత్తారు.

## ఆ వార్తల్లో నిజం లేదు.. మమతా కోసం రాయబారం చేయలేదు: సౌరవ్ గంగూలీ



టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తనపై వస్తున్న రాజకీయ ఊహాగానాలకు తెరదించాడు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తరఫున లోక్‌సభ ఎంపీ యూసఫ్ పఠాన్‌తో తాను రాయబారం చేశానంటూ వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించాడు. ఆ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని, అవన్నీ కల్పితాలని ఒక ప్రకటనలో స్పష్టం చేశాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మమతా బెనర్జీ ఓటమి పాలయ్యారన్న నేపథ్యంలో, ఆమెను ఉప ఎన్నిక ద్వారా పార్లమెంటుకు పంపేందుకు తృణమూల్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, అందులో భాగంగా బహరంపూర్ ఎంపీ యూసఫ్ పఠాన్‌ను రాజీనామా చేయమని కోరినట్లు ఓ బెంగాలీ పత్రికలో కథనం వెలువడింది. ఈ విజ్ఞప్తిని మమతా బెనర్జీ తరఫున సౌరవ్ గంగూలీనే యూసఫ్ పఠాన్‌కు చేరవేశారని ఆ కథనం పేర్కొంది. ఈ కథనాలపై గంగూలీ తీవ్రంగా స్పందించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా అత్యంత నిర్లక్ష్యంగా ఈ వార్తలు రాశారు. యూసఫ్ పఠాన్‌కు సందేశం పంపమని మమతా బెనర్జీ నన్ను ఎప్పుడూ కోరలేదు. నేను పఠాన్‌ను సంప్రదించనూ లేదు. రాజకీయపరమైన విషయాల్లో నేను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు" అని గంగూలీ తన ప్రకటనలో వివరించాడు. వాస్తవాలు ధృవీకరించుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని మీడియాకు హితవు పలికాడు. కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరిపై గెలిచి యూసఫ్ పఠాన్ గత సార్వత్రిక ఎన్నికల్లో బహరంపూర్ నుంచి ఎంపీగా ఎన్నికవడం తెలిసిందే. అయితే, ఈ వివాదంపై యూసఫ్ పఠాన్ గానీ, మమతా బెనర్జీ గానీ ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు.

# సొంత పార్టీ మంత్రులను కూడా వదల్లేదు

## : ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంపీ చామల సంచలన వ్యాఖ్యలు



తెలంగాణను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నేడు సిట్ ఎదుట హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మీడియా కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన ఫోన్... జులై 30 నుంచి ఎన్నికలు ముగిసే వరకు అక్రమంగా ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించి, బాధితుడిగా ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. విచారణ అనంతరం చామల మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల వ్యూహాలు పసిగట్టేందుకు, కాంగ్రెస్ ముఖ్య నేతల సంభాషణలు వినేందుకు ఈ ట్యాపింగ్ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు.
అంతేకాకుండా, కేసీఆర్ కేవలం ప్రతిపక్షాలనే కాక.. అధికారం కోసం సొంత పార్టీ మంత్రులు, నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేయించారని, అందులో మాజీ మంత్రి హరీశ్ రావు ఫోన్ కూడా ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి వేరే పార్టీకి వెళ్లేవారిని ముందుగానే గుర్తించి బెదిరించారని దుయ్యబట్టారు. ఈ అక్రమ ట్యాపింగ్ నిందితులకు కచ్చితంగా కఠిన శిక్ష పడుతుందని జోస్యం చెప్పారు.

# టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్: ఏపీ కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు

"సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం. ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను," అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు.

ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశం


మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రవాస భారతీయుల (డయాస్పోరా) సమావేశంలో లోకేష్ ఉద్విగ్నభరితంగా ప్రసంగించారు. "మీరు భారతదేశాన్ని విడిచి వచ్చినా, భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా, మన సంస్కృతి, సంప్రదాయాలను గుండెల్లో మోస్తున్న మీ విజయాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయి" అని ఆయన ప్రశంసించారు. భారత్-రష్యా బంధం అత్యంత విశ్వసనీయమైనదని, ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో ఈ స్నేహం మరింత బలపడిందని అన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ దేశ కీర్తిప్రతిష్టలను చారిత్రక శిఖరాలకు చేర్చారని కొనియాడారు.

అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కండి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని లోకేష్ వివరించారు. "యువ జనాభా, సుదీర్ఘ తీరప్రాంతం, ఆధునిక ఓడరేవులు మన బలం. పెట్టుబడులను ఆకర్షించి, వాటిని యువతకు ఉపాధిగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం," అని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో ఏపీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి ఏరోస్పేస్ వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు.
"మీరంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక్క పెట్టుబడి తీసుకురండి, యువతకు ఉద్యోగాలివ్వండి. మీకు ఏ సమస్య వచ్చినా ఏపీఎన్నార్టీ అండగా ఉంటుంది, ఆ బాధ్యత నాది," అని లోకేష్ భరోసా ఇచ్చారు. బలమైన భారత్ కోసం 'నమో' (నరేంద్ర మోదీ) అయితే, బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం 'నమో' (నాయుడు-మోదీ) కలయిక పనిచేస్తోందని ఆయన అభివర్ణించారు.

అమరావతి, విశాఖకు స్మార్ట్ ట్రాఫిక్ సొబగులు

పర్యటనలో భాగంగా, రష్యాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాండెక్స్ (ఖఅంవ×) ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి, విశాఖపట్నం నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్ అమలుపై చర్చించారు. లాస్ట్-మైల్ రవాణా ఖర్చులను తగ్గించేందుకు యాండెక్స్ అటానమస్ వాహనాలు, ప్రిడిక్టివ్ రూటింగ్ సాఫ్ట్‌వేర్‌ను



వినియోగించుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు.

విశాఖ కేంద్రంగా ఫార్మా ఎగుమతులు

విశాఖపట్నాన్ని రష్యా, కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (జ×ూ) మార్కెట్లకు ఎగుమతుల హబ్‌గా మార్చడమే లక్ష్యమని లోకేష్ తెలిపారు. మాస్కోలో ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్ కుమార్‌తో భేటీ సందర్భంగా, విశాఖలో ఆ సంస్థ నిర్మిస్తున్న యూనిట్ పనులను వేగవంతం చేయాలని కోరారు. విశాఖలో రూ.200 కోట్ల వ్యయంతో, 300 మందికి ఉపాధి కల్పించేలా తమ యూనిట్ నిర్మాణం జరుగుతోందని, 2027 మార్చి నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తామని ముఖేష్ కుమార్ వివరించారు.

టీచర్లు లేని 'స్కూల్ 21' పై ఆసక్తి

ఈ పర్యటనలో మరో ముఖ్యమైన ఘట్టం, మాస్కోలోని వినూత్న పాఠశాల 'స్కూల్ 21'ను సందర్శించడం. స్బేర్ బ్యాంక్ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక తరగతులు ఉండవు. విద్యార్థులు ప్రాజెక్ట్ ఆధారిత పనుల ద్వారా ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటారు. ఇక్కడ ప్రవేశానికి గత విద్యార్హతలతో సంబంధం లేకుండా, సమస్య పరిష్కార నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ విద్యా విధానంపై లోకేష్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. నిర్వాహకులు, విద్యార్థులతో మాట్లాడి, అక్కడి పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఏపీలో విద్యా సంస్కరణలకు ఈ మోడల్ ఎంతవరకు ఉపయోగపడుతుందనే కోణంలో అధ్యయనం చేశారు.

మొత్తం మీద, మంత్రి లోకేష్ రష్యా పర్యటన కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, విద్య, సాంకేతికత, నగరాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నూతన భాగస్వామ్యాలను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ చిత్రపటాన్ని మార్చే దిశగా సాగుతోంది. ఈ సమావేశంలో లోకేష్ వెంట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# కొత్తూరు గ్రామ సమస్యలు మీద దృష్టి సారించాలి....

## బి ఎస్ పి నేత సూదికొండ మాణిక్యాలరావు

మండలం లోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మీద దృష్టి సారించి వాటి పరిష్కారం దిశ గా చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు విజ్ఞప్తి చేశారు ఈరోజు కొత్తూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి కోరుకొండ జగదీష్ ను కలిసి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది గ్రామంలో కొన్ని ప్రాంతాలలో మంచినీటి కొళాయిల నిర్మాణం లేకపోవడం ఉన్న మంచినీటి కొళాయిలు మరమ్మతులకు గురికావడంతో మంచినీటి కొరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేయడం జరిగింది గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నదని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేయాలని కోరడం జరిగింది

జన నివాస ప్రాంతాల మధ్య వెచ్చలవిడిగా సంచరిస్తు ప్రజల ఆరోగ్యానికి పెను ప్రమాదకరంగా మారుతున్న పందులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది గ్రామపంచాయతీ పరిధిలో పూర్తిస్థాయిలో మురికినీటి కాలువల నిర్మాణం చేపట్టాలని ముఖ్యంగా ప్రధాన రహదారి కి ఇరువైపులా మురికినీటి కాలువల నిర్మాణం లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి సైతం రోడ్లు చెరువులలా మారుతున్నాయని కావున పూర్తిస్థాయిలో మురికి నీటి కాలువల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేయడం జరిగింది గ్రామం లో అసంపూర్ణంగా నిలిచిపోయిన సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరడం జరిగింది



గ్రామపంచాయతీలో గల పలు సమస్యల మీద దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం సమర్పించడం జరిగింది

# చారిత్రాత్మక వరంగల్ క్లబ్ 96 ఏళ్ల ఘన చరిత్రకు ప్రతీక



జంట నగరాల సామాజిక, సాంస్కృతిక, క్రీడా రంగాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న వరంగల్ క్లబ్ తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక క్లబ్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. దాదాపు 96 ఏళ్ల ఘన చరిత్రను సొంతం చేసుకున్న ఈ క్లబ్, సంప్రదాయం మరియు ఆధునికతకు ప్రతీకగా నేటికీ తన ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తోంది. 1930 దశకంలో "ఆఫీసర్స్ క్లబ్"గా ఆవిర్భవించిన ఈ సంస్థ అభివృద్ధిలో పింగిలి వంశస్థుల సేవలు చిరస్మరణీయమైనవి. క్లబ్ స్థాపన కోసం పింగిలి కుటుంబం దాదాపు రెండు ఎకరాల విలువైన స్థలాన్ని అందించడం ద్వారా ఈ మహోన్నత సంస్థకు బలమైన పునాది వేశారు. అనంతరం జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, నగర ప్రముఖులు, వివిధ రంగాల పెద్దల సహకారంతో ఈ క్లబ్ క్రమంగా అభివృద్ధి చెందుతూ నేటి వరంగల్ క్లబ్‌గా రూపుదిద్దుకుంది. "ఆఫీసర్స్ క్లబ్" నుండి "వరంగల్ క్లబ్"గా రూపాంతరం చెందిన తరువాత సభ్యత్వ పరిధి విస్తరించి, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే సమగ్ర సామాజిక వేదికగా ఎదిగింది. నాటి ఆఫీసర్స్ క్లబ్ నేడు వేలాది మంది సభ్యులతో జంట నగరాల గర్వకారణమైన వరంగల్ క్లబ్‌గా నిలిచింది. పచ్చని ప్రకృతి వాతావరణంలో విస్తరించి ఉన్న ఈ క్లబ్, నగర జీవన రద్దీ మధ్య ప్రశాంతతను అందించే అరుదైన ప్రదేశంగా నిలుస్తోంది. శతాబ్ద కాలానికి పైగా వయస్సు కలిగిన వృక్షాలు, విశాలమైన పచ్చిక బయళ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం సభ్యులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సభ్యుల అవసరాలకు అనుగుణంగా స్విమ్మింగ్ పూల్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు , టేబుల్ టెన్నిస్, జిమ్నాసియం, క్యారమ్స్, యోగా సదుపాయాలు, క్యాంటీన్, అతిథి గదులు తదితర ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి క్రీడలు, వినోదం, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని క్లబ్ కల్పిస్తోంది. హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, గుంటూరు, గోవా, కొచ్చి తదితర ప్రాంతాల్లోని ప్రముఖ క్లబ్‌లతో అనుసంధానం కలిగి ఉండటం వరంగల్ క్లబ్ ప్రత్యేకత. ఈ పరస్పర అనుసంధానం క్లబ్ ప్రతిష్ఠను మరింత పెంచడంతో పాటు సభ్యులకు విస్తృత అవకాశాలను అందిస్తున్నాయి.

క్లబ్ పాలనలో ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది. హనుమకొండ జిల్లా కలెక్టర్ అధ్యక్షునిగా, వరంగల్ పోలీస్ కమిషనర్ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తారు. సభ్యుల ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కార్యవర్గం ఏర్పడటం ఈ సంస్థ ప్రత్యేకత. ప్రతి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా సభ్యుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. వరంగల్ క్లబ్ చరిత్రలో మహిళల ప్రాతినిధ్యానికి ప్రత్యేక స్థానం కల్పించిన ఘట్టంగా గత ఎన్నికలు నిలిచాయి. క్లబ్ స్థాపన నుంచి తొలిసారిగా ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యురాలిగా ఒక మహిళ ఎంపిక (నామినేట్) కావడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా గుర్తింపు పొందింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ప్రోత్సాహంతో ఏర్పడిన కార్యవర్గంలో మహిళకు అవకాశం లభించడం మహిళా సాధికారత, సమాన అవకాశాలకు ప్రతీకగా నిలిచింది. ఈ పరిణామం క్లబ్ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. అధికారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు, సామాజిక సేవకులు తదితర ప్రముఖులు క్లబ్ సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం శాశ్వత సభ్యులు, జీవితకాల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 1,700 మంది సభ్యులతో క్లబ్ తన ప్రజాదరణను మరింత విస్తరించుకుంది. గత తొమ్మిది దశాబ్దాలుగా వరంగల్ క్లబ్ అనేక సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది. జాతీయ పండుగలు, సాంస్కృతిక ఉత్సవాలు, క్రీడా పోటీలు, సేవా కార్యక్రమాలు, కుటుంబ సమ్మేళనాలు నిర్వహిస్తూ సమాజంలో స్నేహభావం, సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. జంట నగరాల అభివృద్ధి ప్రయాణానికి



సాక్షిగా నిలిచిన వరంగల్ క్లబ్ కేవలం ఒక సామాజిక సంస్థ మాత్రమే కాదు, విలువలను పంచే వేదిక కూడా. పాత తరం అనుభవాలను కొత్త తరానికి అందిస్తూ, యువతలో నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో విశేష కృషి చేస్తోంది. చరిత్ర, సంప్రదాయం, సేవాభావం, ప్రతిష్ఠ, ఆధునికతల సమ్మేళనంగా నిలిచిన వరంగల్ క్లబ్ తన 96 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయక సంస్థగా నిలుస్తోంది. పింగిలి కుటుంబం అందించిన పునాది, జిల్లా కలెక్టర్లు మరియు నగర ప్రముఖులు అందించిన సహకారం, సభ్యుల అంకితభావం కలిసి నిర్మించిన ఈ సంస్థ జంట నగరాల సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# హైదరాబాద్‌లో "సండేస్ ఆన్ సైకిల్" ఈవెంట్

## : ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్, జూన్ 6:
ప్రపంచ సైకిల్ దినోత్సవం రెండు వేల ఇరవై ఆరు దేశవ్యాప్త వేడుకలలో భాగంగా భాగ్యనగరంలో ఒక భారీ సైక్లింగ్ కార్యక్రమానికి వేదిక సిద్ధమైంది. భారతీయ ఖేల్ ప్రాధికారణ్ (ఎస్.ఎ.ఐ), స్మార్ట్‌బైక్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ (హెచ్.బి.సి) మరియు వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రేపు, జూన్ ఏడవ తేదీ ఆదివారం నాడు నగరంలో "సండేస్ ఆన్ సైకిల్" ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం రేపు ఉదయం ఏడు గంటల ముప్పై నిమిషాలకు హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్ (ఓ.ఆర్.ఆర్) సైక్లింగ్ ట్రాక్, నార్సింగి హబ్ వేదికగా ప్రారంభం కానుంది.

పౌరులలో ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు గౌరవనీయులైన భారత ప్రధానమంత్రి ప్రారంభించిన 'ఫిట్ ఇండియా మూవ్‌మెంట్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు




తోడ్పడుతూ, నిత్య జీవితంలో సైక్లింగ్‌ను ఒక సులభమైన, స్థిరమైన శారీరక వ్యాయామంగా మలచుకునేలా అన్ని వయసుల వారిని ప్రోత్సహించడమే ఈ ఈవెంట్ యొక్క ముఖ్య ఉద్దేశమని ఎస్.ఎ.ఐ – ఎస్.టి.సి హైదరాబాద్ చీఫ్ కోచ్ జిమ్నాస్టిక్స్ మరియు ఇన్‌చార్జ్ అయిన డాక్టర్ పి. రవీంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ప్రత్యేక సైక్లింగ్ డ్రైవ్‌లో నగరానికి చెందిన వందలాది మంది సైక్లిస్టులు, ఫిట్‌నెస్ ప్రియులు, విద్యార్థులు, క్రీడాకారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొననున్నారు.

నిత్యం శారీరక శ్రమ చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజల్లో చైతన్యం తేవడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, హైదరాబాద్ మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజలందరూ రేపు ఉదయం ఏడున్నర గంటలకల్లా నార్సింగి హబ్ ఓ.ఆర్.ఆర్ సైక్లింగ్ ట్రాక్ వద్దకు చేరుకుని ఈ సైక్లింగ్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని డాక్టర్ పి. రవీంద్ర కుమార్(జిమ్నాస్టిక్ కోచ్) పిలుపునిచ్చారు.

# మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబు

## మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్




తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 9 మెగా డీఎస్సీలు నిర్వహించి 2,16,179 ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీని అత్యంత పారదర్శంగా నిర్వహించారని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, ఆన్లైన్లో పరీక్షలు నిర్వహించి, ఎటువంటి అపోహలకు తావు లేకుండా, పరీక్ష ఫలితాలను పబ్లిక్ డొమెన్లో పెట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఈ ఘనత దక్కుతుందని ఈరోజు తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వైసీపీ పాలనలో జగన్ ముఖ్యమంత్రిగా ఉపాధ్యాయులను వారు హక్కులను కాలరాశి, వారికి ఉన్న ప్రయోజనాలను తక్కువ చేసి, రివర్స్ పిఆర్సి ఇచ్చి , కరోనా సమయంలో లిక్కర్ షాపులు ముందు ఉపాధ్యాయులను డ్యూటీలు వేసి అవమానపరిచింది కాకుండా, పోరాడుతున్న ఉద్యమ సమయంలో హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఉద్యమ సమయంలో పోలీసులను స్కూలుకు, వారి ఇంటికి పంపి భయభ్రాంతులకు గురి చేసిన విషయం జగన్ రెడ్డి మరిచిపోయినట్లు ఉందని, జగన్ రెడ్డి ప్రకటించిన ఉద్యోగాల్లో ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదని, కూటమి ప్రకటించిన మెగాడీఎస్సీని నిర్వహించకుండా కోర్టులో 244 కేసులు వేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేయడమే జగన్ రెడ్డి లక్ష్యం అని, డీఎస్సీలో పరీక్షలు రాసిన తనకు అన్యాయం జరిగినట్లుగా ఎక్కడ ఒక ఫిర్యాదు కూడా చేయలేదని, ఆ ప్రక్రియ ముగిసి ఏడాది కాలం తర్వాత, మేల్కొని తన పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం వైసీపీ ఉనికిని కాపాడుకోవడానికి జగన్ రెడ్డి ప్రయత్నాలు బెడిసి కొట్టాయని నాగ జగదీష్ అన్నారు. శ్రీభోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ మెగా డీఎస్సీ లో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు వారు కష్టపడి చదివి సాధించుకున్న ఉద్యోగాలు మీద రాజకీయ వైరంతో వైసిపి నాయకులు ధర్నాలు ఉద్యమాలు చేయడం భావ్యం కాదని, ఉద్యోగులు పొందిన వారి వైసీపీ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారని విషయం మరిచిపోయి దీనిలో రాష్ట్రా వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారని, వివేకానంద రెడ్డి హత్య కేసు, కోడి కత్తి, గులకరాయి వంటివి తెలుగుదేశంపై విస్తృత ప్రచారం చేసి లబ్ధి పొందినట్లే మెగా డిఎస్సి పై కూడా విష ప్రచారం చేసినప్పటికీ ప్రజల్లో స్పందన లేకపోవడంతో వైసీపీ శ్రేణులు తోకముడిచారని, ఈ రెండు సంవత్సరాలు కాలంలో ఫేక్ ప్రచారాలతో పబ్బం గడుపుకున్నారని, వైసిపి నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషించ లేకపోయిందని, అటు అసెంబ్లీలో ఇటు బయట వైసీపీ నిర్వీర్యమైపోయిందని, నాగ జగదీష్ మండిపడ్డారు. కాశి ఇది ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగ సంక్షేమ సంఘం కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుతున్న జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీ తులసి




పట్టణంలోని 82వ డివిజన్ పరిధిలో గల 13, 15, సచివాలయల ఆవరణల జీవీఎంసీ సిబ్బంది వారి ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ లక్ష్మీతులసి జీవీఎంసీ 82వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ పోలారపు త్రినాథ్ పాల్గొని అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పర్యావరణం దృష్టిలో పెట్టుకొని, ఈ రోజు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అదేవిధంగా నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు, కాలుష్యాన్ని అరికట్టేందుకు అధికారులు నిరంతరం ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని, దీనికి ప్రజల మద్దతు అవసరమని కోరారు. అధికారుల సంకల్పానికి రాజకీయ శ్రేణులు, ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. "ప్లాస్టిక్కు నిషేధిద్దాం ప్రకృతిని కాపాడుకుందాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ తమ పరిస రాలలో మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టడంలో అధికారులకు సహకరించాలని ప్రజలకు త్రినాథ్ పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ముందస్తు జాగ్రత్తలు: మారుతున్న కాలంలో వాతావరణ కాలుష్యం వలన వచ్చే అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండాలంటే ప్రజల్లో పర్యావరణ స్పృహతో పాటు శారీరక శ్రమ కూడా పెరగాలని ముఖ్య అతిథులు సూచించారు. కాలుష్య నివారణకు, వ్యక్తిగత ఫిట్నెస్కు నిత్య జీవితంలో కనీసం రోజుకొక్క సారైనా సైకిల్ తొక్కడం, నడక సాగించడం వంటి అలవాట్లను ప్రతి ఒక్కరూ ప్రాక్టీస్ చేయాలని కోరారు అదేవిధంగా ప్లాస్టిక్ నిషేధం అని నినాదంతో ప్రతి ఒక్కరూ సహకరించాలని మీ మీ చోట్ల మొక్కలు నాటాలని, మంచి వాతావరణం ఉండాలి ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఎవరికి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వీరినంతవరకు రోజుకొక రోజుకి ఒకసారైనా సైకిల్ తొక్కడం గానీ, ఇతరత్రా ఆరోగ్య సూచనల ద్వారా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో 82వ డివిజన్ టిడిపి పార్టీ అధ్యక్షులు దాడి జగన్, శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ అప్పికొండ గణేష్, బొడ్డేడ దావయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బర్నిఖానా రాంబాబు, అనకాపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ ఎస్. భానుచందర్ (అఖి), ముప్పడి మణికంఠ, గైపురి త్రిమూర్తులు, బొండా ప్రసాద్, అనకాపల్లి జీవీఎంసీ జోనల్ 7 పారిశుద్ధ విభాగం ఇన్స్పెక్టర్ రవికుమార్, భాస్కరరావు, సచివాలయం సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు

---





ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కసింకోట పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం మరియు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాము.

ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ, మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతికి సేవ చేయవచ్చని అవగాహన కల్పించాము. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
07 ఆదివారం జూన్ 2026

# సమాజంలోని ఘటనలకు సినిమాలకు లంకె..

## నటి అనసూయ కీలక వ్యాఖ్యలు



సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటనకు సినిమాలను కారణంగా చూపడం సరికాదని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. సినిమా ప్రభావం, సామాజిక బాధ్యత అంశాలపై శనివారం ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సృజనాత్మక స్వేచ్ఛతో పాటు, కంటెంట్ విషయంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలని ఆమె గుర్తుచేశారు.సినిమా అనేది ప్రాథమికంగా ఒక కథా రూపమని, అందులోని మంచి చెడులను ప్రేక్షకులు తమ విచక్షణతోనే గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతికూల పరిణామాలకు సినిమాలనే తప్పుబట్టడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కంటెంట్ విషయంలో క్రియేటర్లు, దర్శకులు, నటులతో పాటు ప్రేక్షకులకు సైతం సమాన బాధ్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.గతంలో సినిమాల్లో కథానాయకులు స్ఫూర్తిప్రదాతలుగా, ప్రతినాయకులు గుణపాఠంగా ఉండేవారని, కానీ ప్రస్తుతం నాటకీయత కోసం ఆ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపడం లేదని అనసూయ అభిప్రాయపడ్డారు. క్రియేటివ్ అంశాల్లో ఏకీభవించలేక కొన్నిసార్లు తాను అవకాశాలను సైతం వదులుకున్నట్లు ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో సినిమా కంటెంట్‌ను విశ్లేషించడాన్ని, ప్రశ్నించడాన్ని ఆమె స్వాగతించారు. దీనిని సృజనాత్మకతపై దాడిగా కాకుండా, సమాజంలో పెరుగుతున్న చైతన్యంగా భావించాలని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించినవి కావని, పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేయడమే తన అభిమతమని అనసూయ వివరణ ఇచ్చారు.

## రామ్ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత.. విజువల్స్‌పై భారీ అంచనాలు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారి రూపొందిస్తున్న తొలి చిత్రం ఎ=ఉూూ23కి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ తిరునవుక్కరసు (తిరు) భాగమయ్యారు. ఆయన చేరికతో సినిమా సాంకేతిక బృందం మరింత బలోపేతమైంది. తన పుట్టినరోజు సందర్భంగా మే 15న రామ్ ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ఆయనే కథ, దర్శకత్వం అందిస్తూ, 'వీర' అనే ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఇది ఒక సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రానికి తిరు కెమెరామెన్‌గా వ్యవహరించనుండటంతో అంచనాలు పెరిగాయి. '24', 'జనతా గ్యారేజ్', 'భరత్ అనే నేను', 'పేట' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు అద్భుతమైన విజువల్స్ అందించిన తిరు, రామ్ తొలి దర్శకత్వ చిత్రానికి ఎలాంటి దృశ్యమాన అనుభూతినిస్తారోనని ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. గతంలో 'ఆంధ్రా కింగ్ తాలుకా' (2025) చిత్రానికి గీత రచయితగా పనిచేసిన రామ్, ఇప్పుడు ఏకంగా రైటర్, డైరెక్టర్, హీరోగా బహుముఖ బాధ్యతలు చేపట్టడం విశేషం. తిరు చేరికతో ఎ=ఉూూ23 విజువల్స్ అత్యున్నత స్థాయిలో ఉంటాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుండగా, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## జేడీ చక్రవర్తితో గొడవపై రంభ ఆసక్తికర వ్యాఖ్యలు!



ఒకప్పుడు టాలీవుడ్‌ను తన గ్లామర్, నటనతో ఊపేసిన సీనియర్ నటి రంభ... తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కో-స్టార్, నటుడు జేడీ చక్రవర్తితో తనకున్న అనుబంధం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. 'బొంబాయి ప్రియుడు' సినిమా షూటింగ్ సమయంలో జేడీ చక్రవర్తితో తనకు మంచి స్నేహం ఏర్పడిందని రంభ చెప్పింది. జేడీ ఎప్పుడూ చాలా సరదాగా ఉంటారని, అందరినీ ఎంటర్‌టైన్ చేస్తారని, ఆయనతో గడిపిన సమయం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని కొనియాడింది. అయితే, అంతటి ఆత్మీయ స్నేహితుడైన జేడీ చక్రవర్తి... తన పెళ్లికి రాకపోవడం తనను తీవ్రంగా బాధించిందని రంభ ఈ సందర్భంగా వెల్లడించింది. "ఆయన నాకు అంత క్లోజ్ ఫ్రెండ్ అయ్యుండి కూడా నా పెళ్లికి రాలేదు. ఆ సమయంలో నేను చాలా అప్సెట్ అయ్యాను. ఆ తర్వాత ఆయన కనిపించినప్పుడు పెళ్లికి ఎందుకు రాలేదంటూ గట్టిగా తిట్టాను కూడా" అని రంభ నవ్వుతూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది. కొంతకాలం ఇద్దరం కలిసి ఒక టెలివిజన్ షోలో సందడి చేశామని, ఆ సమయంలో కూడా పాత రోజులను గుర్తుచేసుకుంటూ స్టేజ్ పైన ఎంతో ఫన్ క్రియేట్ చేశామని ఆమె తెలిపింది. ఆ ఎపిసోడ్‌కు ప్రేక్షకుల నుండి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది.తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ రంభ కొన్ని చేదు నిజాలను పంచుకుంది. కెరీర్ ప్రారంభంలో తనకు ఎక్కువగా గ్లామర్ పాత్రలే వచ్చాయని.. ఆ తర్వాత నటిగా తన ప్రతిభను నిరూపించుకున్నప్పటికీ, ఇండస్ట్రీ తనను కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. దీనివల్ల ఒక నటిగా తన పూర్తి నటనను ప్రదర్శించే అద్భుతమైన అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని రంభ అభిప్రాయపడింది.

## 80 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తడంతో గాయమైంది...

### ఆ సమయంలో మంచానికే పరిమితమయ్యాను: రకుల్ ప్రీత్ సింగ్



ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా స్పందించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎటువంటి సేఫ్టీ బెల్ట్ లేకుండా ప్రయత్నించడం వల్ల స్లిప్ డిస్క్ బారినపడ్డానని, ఆ గాయం కారణంగా సుమారు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు.నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "మీ ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామం. అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమే. ఆనాడు నేను చేసిన చిన్న పొరపాటు స్లిప్ డిస్క్‌కు దారితీసింది" అని ఆమె పేర్కొన్నారు. ఆ గాయం కారణంగా కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని ఆమె వివరించారు.ఎంతో చురుకుగా ఉండే తాను, రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తనను మానసిక వేదనకు గురిచేసిందని రకుల్ తెలిపారు. "ఇది కేవలం శారీరక గాయమే కాదు, నన్ను మానసికంగానూ ఎంతో కృంగదీసింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఈ షోలో పంచుకున్నారు.

## డైరెక్ట్ హిందీ సినిమా ఎప్పుడు? అదిరిపోయే సమాధానం ఇచ్చిన రామ్ చరణ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 2013లో 'జంజీర్' (తెలుగులో తుఫాన్) సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ పూర్తిస్థాయి హిందీ సినిమా చేయని చరణ్.. 2023లో సల్మాన్ ఖాన్ నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' చిత్రంలోని 'యేంటమ్మ' సాంగ్‌లో కామియో రోల్‌లో మెరిశాడు. తాజాగా శనివారం మీడియాతో మాట్లాడిన అతడు.. హిందీ సినిమాలపై తన మనసులోని మాటను పంచుకున్నాడు.తన అభిమానులు మళ్లీ పూర్తిస్థాయి హిందీ సినిమాలో ఎప్పుడు చూడబోతున్నారనే ప్రశ్నకు చరణ్ చాలా ఆసక్తికరమైన సమాధానమిచ్చాడు. "నాకు హిందీ, తెలుగు సినిమా అనే తేడాలు తెలియవు. నేను చేస్తున్నవన్నీ కేవలం 'ఇండియన్ సినిమాలు' మాత్రమే. భవిష్యత్తులో కూడా సినిమాలను అలాగే చూద్దాం" అని చరణ్ స్పష్టం చేశారు. 'ఆర్ఆర్ఆర్' సాధించిన విజయం తర్వాత చరణ్ పాన్-ఇండియా స్థాయిలో ప్లాన్ చేసుకుంటున్నట్లు ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.సినిమా రంగానికి భాషా హద్దులు లేవంటున్న రామ్ చరణ్.. తనకు అన్ని పరిశ్రమల దర్శకులతో కలిసి పనిచేయాలని ఉందని వెల్లడించారు. ముంబైకి చెందిన హిందీ దర్శకులతో పాటు బెంగాల్, తమిళనాడు ఇలా దేశంలోని అన్ని ప్రాంతాల ప్రతిభావంతులైన డైరెక్టర్లతో సినిమాలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న కథలను, సంస్కృతులను తన సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందించాలనేది తన ఆకాంక్ష అని చరణ్ పేర్కొన్నారు.ఇక 1973లో ప్రకాశ్ మెహ్రా దర్శకత్వంలో అమితాబ్ బచ్చన్, జయా బచ్చన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఒరిజినల్ 'జంజీర్' బాలీవుడ్‌లో ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. చరణ్ నటించిన రీమేక్ వెర్షన్‌లో ఆతడే స్వయంగా 'ముంబై కే హీరో' అనే పాటతో ప్లేబ్యాక్ సింగర్‌గా మారడం విశేషం.

# స్వర్గానికి దారి చూపిస్తానంటున్న దివి..


## జిమ్ అవుట్ ఫిట్ తో సెగలు పుట్టిస్తూ!

బుల్లితెర అయినా.. వెండితెర అయినా.. అందంతో ఆకట్టుకోవడానికి సెలబ్రిటీలు ఎప్పుడూ ముందుంటారు. అలా నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. మరి కొంతమంది కట్టు బొట్టుతో సాంప్రదాయంగా కనిపిస్తూ అభిమానులను రెచ్చగొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మరొక బ్యూటీ స్వర్గానికి దారి చూపిస్తానంటూ అందాలతో అదరగొట్టే ప్రయత్నం చేసింది. ఆమె ఎవరో కాదు అందాల తార, అభినయ సుందరి దివి.

జిమ్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించిన దివి..

ఒకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తూనే.. మరొకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూ తెలుగు కుర్రాల హృదయాలను దోచుకుంటోంది ఈ చిన్నది . ఈసారి కాస్త భిన్నంగా జిమ్ సెంటర్ నుండి సెగలు పుట్టిస్తూ.. జిమ్ ఔట్ఫిట్ లో కొన్ని ఫోటోలు షేర్ చేయడమే కాకుండా స్వర్గానికి దారి చూపిస్తా నాతో వచ్చేయ్ అంటూ క్యాప్షన్ జోడించి, అందరిని ఆకట్టుకుంది. ఇక తాజాగా జిమ్ సెంటర్ నుండి కొన్ని ఫోటోలు షేర్ చేసిన దివి.. అందులో జిమ్ అవుట్ ఫిట్ ధరించి మెస్మరైజ్ చేసింది. ఒకవైపు కష్టపడుతూ బరువులు మోసేస్తూ.. మరొకవైపు తన అందాలతో గిలిగింతలు పెట్టింది. ఓవరాల్గా ఈ జిమ్ అవుట్ ఫిట్ లో అమ్మడి అందానికి సోషల్ మీడియాలో మంటలు రాజుకుంటున్నాయి.





దివి సినీ ప్రస్థానం..

1996 మార్చి 15న హైదరాబాదులో శశికాంత్ వైద్య, దేవకీ దంపతులకు జన్మించిన ఈమె.. పదవ తరగతి వరకు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్లో తన స్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసింది. ఆ తర్వాత జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంబీఏ పూర్తి చేసిన ఈమె.. 2017లో మోడలింగ్ రంగంతో తన కెరీర్ ను ఆరంభించింది. అలా పలు ఫ్యాషన్ సంస్థలకు మోడలింగ్ కూడా చేసింది. అలా మోడల్ గా పనిచేస్తున్న సమయంలో 2018లో లెట్స్ గో అనే షార్ట్ ఫిలిమ్ ద్వారా నటిగా అవకాశం అందుకున్న ఈమెకు.. 2019లో వచ్చిన మహర్షి సినిమా నటిగా ప్రాణం పోసింది. అలా ఈ సినిమాతో తన నటనతో ప్రూవ్ చేసుకున్న దివి 2019లో ఏ వన్ ఎక్స్ప్రెస్ , 2021లో క్యాబ్ స్టోరీస్ వంటి చిత్రాలతో తన ఉనికిని చాటుకుంది.

దివి బిగ్ బాస్ ప్రయాణం..

అలా సినిమాలలో చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న సమయంలోనే బిగ్ బాస్ తెలుగు సీజన్ 4లో అవకాశం లభించింది. అయితే హౌస్ లోకి వచ్చిన ఈమె 49 రోజుల పాటు హౌస్ లో కొనసాగి, ఆ తర్వాత హౌస్ నుండి బయటకు వచ్చేసింది. ఇక బిగ్ బాస్ తో వచ్చిన గుర్తింపును ఉపయోగించుకొని.. రుద్రంగి, గాడ్ ఫాదర్ , జిన్నా, నయీమ్ డైరీస్, లంబసింగి , సింబ వంటి చిత్రాలలో నటించింది. పుష్ప 2 లో రిపోర్టర్ గా పనిచేసిన ఈమె 2025లో చివరిగా డాకు మహారాజ్ సినిమాలో ఝాన్సీ పాత్రతో అదరగొట్టేసింది. ఇప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఇలా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

## మృణాల్.. ప్లాన్ మార్చాల్సిందేనా?



టీవీ యాక్ట్రెస్ గా కెరీర్ ప్రారంభించి, ప్రస్తుతం బాలీవుడ్ తోపాటు టాలీవుడ్ లోనూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందిన మృణాల్ ఠాకూర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. అందానికి, అభినయానికి ఈక్వెల్ ఇంపార్టెన్స్ ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె.. ఇప్పుడు సినిమాల సెలెక్షన్ విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే మృణాల్ 2014లో మరాఠీ చిత్రం విట్టి దండుతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. అనంతరం 2018లో విడుదలైన లవ్ సోనియా చిత్రంలో ప్రధాన పాత్ర పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత సూపర్ 30, బాట్లా హౌస్, తూఫాన్, జెర్సీ, ధమాకా, పిప్పా వంటి చిత్రాలతో బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కానీ మృణాల్ కు అసలైన స్టార్ డమ్ ను తీసుకొచ్చింది టాలీవుడ్ నే అని చెప్పాలి. 2022లో విడుదలైన సీతారామంలో సీతామహాలక్ష్మి పాత్రలో ఆమె యాక్టింగ్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఆ చిత్రం భారీ విజయాన్ని సాధించడంతో తెలుగు ప్రేక్షకులకు మృణాల్ ఎంతో దగ్గరయ్యారు. అనంతరం నాని హీరోగా వచ్చిన హాయ్ నాన్నలో కూడా తన పాత్రలో మెప్పించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఆ రెండు చిత్రాల విజయాలతో మృణాల్ పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలు చేస్తారనే అభిప్రాయం కూడా బలపడింది. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని ప్రాజెక్టులు మాత్రం ఆ స్థాయి ప్రభావం చూపలేకపోయాయి. ముఖ్యంగా ఫ్యామిలీ స్టార్ సహా పలు సినిమాలు ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయింది. అయినప్పటికీ మృణాల్ కు అవకాశాలు మాత్రం తగ్గలేదు. ఇటీవల వరుణ్ ధావన్, పూజా హెగ్డేతో కలిసి నటించిన హై జవానీ తో ఇష్క్ హోనా హై విడుదలైంది. ఆ చిత్రంలో మృణాల్ స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, నటనకు మంచి మార్కులు వచ్చినప్పటికీ సినిమా కథ విషయంలో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. ఓల్డేజ్ కామెడీ, వీక్ స్టోరీ కారణంగా సినిమా ప్రేక్షకులను పూర్తిగా ఆకట్టుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రస్తుతం మృణాల్ సినిమా సెలెక్షన్ పై చర్చ మొదలైంది. నటిగా ఆమె టాలెంట్ పై ఎలాంటి డౌట్స్ లేవని, కానీ సరైన కథలు ఎంచుకోవడం మాత్రం చాలా కీలకమని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం హీరోయిన్ల మధ్య పోటీ ఉన్న సమయంలో కేవలం స్టార్ హీరోలు లేదా భారీ నిర్మాణ సంస్థలపై ఆధారపడకుండా, కంటెంట్ ను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు.